స్కెచ్ :

# కుంటిపిల్ల పెళ్ళి ప్రయత్నం

రచన: చావలి సాంబశివరావు

వర్షాకాలం
సాయంత్రం 6-25

ఉన్నట్టుండి దట్టంగా మబ్బు పట్టింది. రివ్వున గాలి వీస్తోంది దుమారం రేగుతోంది. మరొక క్షణంలో వర్షం కుండపోతగా కురవొచ్చు.

అందుకే రోడ్లమీద జనం త్వరత్వరగా అడుగులు వేస్తున్నారు. తడవకుండా తమ గమ్యస్థానం చేరుకోవాలని వాళ్ళ ఆకాంక్ష.

ఒక కుంటిపిల్ల - పిల్లకాదు పెళ్ళీడు యువతి- గబ గబా తోటివాళ్ళతో కలిసి పోవాలని నడుస్తోంది. అయినా వెనుక పడుతోంది. అలా నడవటం ఎంత కష్టం ?

"సినిమా మనకు అందేనా ?" అంది కుంటిపిల్ల స్నేహితురాలు.

"ఎందుకు అందదు ?" అంటూ కష్టమైనా మరింత జోరుగా నడవ సాగింది కుంటిపిల్ల.

సినిమా చూడాలని అంత ఉత్సాహం.

◆ ◆ ◆

రాత్రి 10-30

జోరున కురిసే వర్షంలో కుంటిపిల్ల నిలువెల్లా తడిసి యింట్లో అడుగుపెట్టింది.

"కుంటి పిల్లవు. పెళ్ళీడు పిల్లవు ఈ వర్షంలో సినిమా కెళ్ళకపోతే కొంప మునుగుతుందా ?" అంటూ మందలించాడు తండ్రి.

"ఇంట్లో పరిస్థితి చూస్తూనే ఉంది. ఆ పావలా పెడితే కూరగాయలు రావా ?" అంది తల్లి.

ఇంక కుంటిపిల్ల ఏం మాట్లాడుతుంది ?

సినిమా చూసిన ఆనందం కాస్తా యిగిరి చక్కాపోయింది.

అన్నం సహించలేదు. నాలుగు మెతుకులు కొరికి నిద్రకుపక్రమించింది కుంటిపిల్ల.

నిద్రాదేవి సయితం ఆమె యెడల కనికరం చూపలేదు.

ఆమె మనస్సులో ఆలోచన.

తండ్రి చిల్లర దుకాణం మీద తెచ్చే సంపాదన కుటుంబానికి చాలడంలేదు. తల్లి "మిషను" మీద బట్టలు కుట్టి ఆర్జించేది స్వల్ప ధనం. తన పెళ్ళి విషయం తల్లిదండ్రుల మనస్సు కుంగదీస్తోంది.

చూస్తూ చూస్తూ కుంటిపిల్లనెవరు పెళ్లాడుతారు ?

తానేం చేయాలి ? ఏం చేస్తే పరిస్థితి మెరుగవుతుంది ?

.... .... .... .... ....

అలాచేస్తే ?....

◆ ◆ ◆

కొద్దిరోజుల్లో కుంటిపిల్ల చేతిమిషన్ ఒకటి తండ్రిచేత కష్టంమీద అప్పుచేసి కొనిపించ గలిగింది. త్వరలోనే దీక్షతో కుట్టు నేర్చుకుంది.

పరిచయం లేకపోయినా కుంటిపిల్ల ధైర్యంచేసి పట్టుదలతో కొందరు గొప్పయింటి గృహిణులను కలుసుకుంది.

తన పరిస్థితి చెప్పుకుని, ఇకనుంచి వాళ్ళ దర్జీపని అంతా తనకే ఇవ్వవలసిందని బ్రతిమాలింది.

కుంటిపిల్ల, ఆడపిల్ల వచ్చిందని దయగల తల్లులు ఆ దీనురాలి విన్నపం మన్నించారు.

ఇదే పద్ధతిమీద కుంటిపిల్ల ఎక్కువ దర్జీపని రాబట్టుకో గలిగింది.

ఇప్పుడామె చేతినిండా పని. రాత్రింబవళ్లు కష్టించి ఓర్పుతో బట్టలు కుడుతోంది నాలుగు డబ్బులు కూడబెట్టి తండ్రికి ఇస్తోంది.

తల్లీ తండ్రీ సంతోషించారు. గంపెడు సంసారం గడవగా ఇంకా ధనం మిగులుతోంది. కుంటిపిల్ల పెళ్ళికోసం ఆ ధనం బ్యాంకులో నిలవచేయసాగారు.

బ్యాంకు ఎకౌంటు పెరిగింది. నాలుగు వందలు పోగుపడినవి.

కాని కుంటిపిల్ల ఆరోగ్యం చెడింది. ఆమెకు తరచు జ్వరం వస్తోంది ఎప్పుడూ కూర్చుని పనిచేయడం మూలాన 'తొంటిలో నొప్పి' ప్రారంభమైంది.

తన ఆరోగ్యంకోసం కుంటిపిల్ల ఎక్కువ డబ్బు వాడనీయదు. ఎప్పుడూ లేని సత్తువ తెచ్చుకొని పనిచేస్తుంది.

కుంటిపిల్ల బాగా చిక్కిపోయింది. రోగిష్టి కళ ఆమె ముఖం మీద తాండవం చేస్తోంది.

ఇలా ఉండగా ఒకరోజున కుంటిపిల్లను చూడాలని పెళ్లివారు వచ్చారు.

పెళ్లికొడుకు మూగవాడు. పేదవాడు. ఏదో ఉద్యోగంచేసి నెలకి అరవై రూపాయలు తెచ్చుకుంటున్నాడు.

ఆ సంబంధం నిశ్చయమైతే బాగుండునని అనేకమందితోపాటు కుంటిపిల్లకూడ సంబరపడింది. మనస్సులో వేయి దేవుళ్ళకు మ్రొక్కుకుంది.

కాని ఆ సంబంధం స్థిరపడలేదు.

ఎందుకని ?

'ఆ రోగిష్టిపిల్ల మావాడి కెందుకయ్యా?', అన్నాడట మూగ పెళ్ళికొడుకు మేనమామ.

"భగవంతుడా ! ఈ కుంటిపిల్లకి ఎప్పుడు పెళ్ళి అవుతుంది ?" అని విలపించారు ఆ దౌర్భాగ్యపు తల్లిదండ్రులు.

——O——


దగ్గు నివారిణి
తిరగపెట్టకుండా దగ్గును యిప్పుడే నిర్మూలించండి ఖరీదు రు. 157-15 ట్రియల్ 12—13.
చెవుడు
పూర్తి కోర్సుద్వారా చెవుడు పూర్తిగా నయమగును. పూర్తి కోర్సు రు. 147-15. ట్రియల్ రు 17-97 వ.పై జాబులు ఇంగ్లీషులో వ్రాయండి.
Dr. SHERMAN,
181. R. N. Guha Road, Calcutta-28